క్లుప్తంగా

సన్మానం



నరేష్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్

మల్హర్: మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గోట్టం నరేష్ ఇటీవల విడులైన జీపీఓ (గ్రామ పాలన అధికారి) ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 42వ ర్యాంకు, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. కాగా, తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది శనివారం నరేష్‌ను శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, సిబ్బంది మహేష్, సతీష్, రాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు..



సిబ్బందిని సన్మానిస్తున్న సుధీర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించిన సరస్వతినది పుష్కరాలకు లక్షలాదిమంది భక్తులు తరలివచ్చిన చెత్తచెదారం లేకుండా శుభ్రం చేసిన పారిశుద్ధ్య కార్మికులను స్థానిక యువకుడు చెమ్మాల సుధీర్ శనివారం సన్మానించి నిత్యావసర వస్తువులు అందజేశాడు. గ్రామ పంచాయతీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను శాలువాతో సన్మానించాడు.

ఉద్యోగ విరమణ పొందిన ఈఈ యాదగిరికి..



ఈఈని సన్మానిస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం బ్యారేజీ ఈఈ ఎలకొండ యాదగిరి ఉద్యోగ విరమణ పొందారు. శనివారం ఆయన మహదేవపూర్ 2 డివిజన్ ఈఈగా పదవీ విరమణ పొందడంతో ఆయనను హనుమకొండలోని ఫంక్షన్‌హాల్‌లో తోటి ఇరిగేషన్ అధికారులు సన్మానించారు.

న్యాయం చేయాలి

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి (ఎస్ఎం)గ్రామ పరిధిలోని సోలిపేట తాటి వనంలో చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మోరంచపల్లి గ్రామానికి చెందిన కొంత మంది తాటి చెట్లను అక్రమంగా నరికి ధ్వంసం చేసినట్లు తెలిపారు. దీంతో గీత కార్మికులు జీవనోపాధి కోల్పోవడం జరుగుతుందని, అధికారులు తాటి చెట్లను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకొని గీతా కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

కన్నాయిగూడెం: మండలంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు శనివారం ఎస్సై వెంకటేశ్ తిరిగి వారి ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన రాజ బాబు, వెంకటేష్, సాయి సెల్‌ఫోన్లను పోగొట్టుకోని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కాగా సీఈఆర్ఐ పోర్టల్ ద్వారా పోగుట్టుకున్న వారి ఫోన్‌లను ట్రేస్ చేసి రికవరీ చేశామని అన్నారు.

తొలకరితో రైతులు బిజీ

- ముందుగానే కురిసిన వర్షం
- దుక్కులు దున్నుతున్న రైతులు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

టేకుమట్ల: గతం కంటే ముందస్తుగానే తొలకరి వానలు పడడంతో రైతులు విత్తనాలను నాటేందుకు దుక్కులను సిద్ధం చేస్తున్నారు. యాసంగిలో ఎక్కువగా వరి, మొక్కజొన్న పంటలను వేసిన రైతులు పంటలు పూర్తి అయిన వెంటనే వరి మినహా ఇతర పంటలను వేసే రైతులు దుక్కులను దున్నిస్తూ వానాకాలని సిద్ధం చేస్తున్నారు. వరి సాగు చేయాలనుకుంటున్న రైతులు దుక్కులలో పెసరు, మినుములు, జీలుగులను చల్లుతూ కలియ దున్నుతున్నారు. వానాకాలంలో ప్రధానంగా పత్తి, మిరప, పసుపు, వరి, మొక్కజొన్న తదితర పంటలను వేస్తారు. కాగా ప్రస్తుతం పత్తి విత్తనాలను నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. కాగా ఫర్టిలైజర్ దుకాణాల వద్ద పత్తి విత్తనాలను కొంటున్నారు.

వర్షాలపై సందేహం..

మే నెల నుంచే వర్షాలు పడడంతో దుక్కులను సిద్ధం చేస్తున్నారు. కానీ మే నెలలోనే వర్షాలు కురిస్తే జూన్, జులై, ఆగస్టు నెలల్లో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయో, లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ముందస్తు తొలకరితో రైతులు వానాకాలం సాగుకు సిద్ధం అవుతూ బిజీ, బిజీగా గడుపుతున్నారు.

దుక్కులను సిద్ధం చేస్తున్నా..



నాకున్న 15 ఎకరాల వ్యవసాయ భూమిలో పంటలు పూర్తి కావడంతో దుక్కులను సిద్ధం చేస్తున్నా. ఇప్పటికే ఐదెకరాలు దుక్కిని సిద్ధం చేసి పత్తి విత్తనాలను నాటేందుకు విత్తనాలను సైతం తీసుకున్నాను. వర్షాలు ముందస్తుగా రావడంతో దుక్కులు సిద్ధం అవుతున్నాయి. ఇంకా 10ఎకరాలలో వరి, మిర్చి, పసుపు వేస్తా. గతంలో కంటే ఈ వానాకాలం దుక్కులను ముందుగానే సిద్ధం చేసి, విత్తనాలను నాటాలనుకుంటున్నా.

- మాదన మునీందర్, రైతు గర్మిళ్లపల్లి

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

- వైద్యాధికారి మహేందర్



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాజేడు: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని వైద్యాధికారి మహేందర్ అన్నారు. మండల కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మహేందర్ మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యం కోసం మంచి అలవాట్లను అలవరుచుకోవాలని అన్నారు. పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు తరుణ్, హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ, హెచ్ఎస్ కోటిరెడ్డి, హెచ్‌పీ తిరుపతి, వెంకటేశ్వర్లు, శేఖర్, ఎస్ఎం సత్యానాగవేణి, ఛాయదేవి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

కాలభైరవుడి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పూజారులు

మంగపేట : మండల కేంద్రంలోని శ్రీ ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో కాలభైరవుడు, మహాచండీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 08.13 గంటలకు బ్రహ్మశ్రీ నరేష్ శర్మ బృందంచే ప్రతిష్ఠ మూర్తి యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మైల నరేష్‌రెడ్డి, సభ్యులు కోమరగిరి కేశవరావు, సాంబ్రాజ్యం, సురేష్, డొక్కా సతీష్, శిరీష, కోటేశ్వర్‌రెడ్డి, దంపతులు భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు



మాట్లాడుతున్న తోట మల్లికార్జునరావు

ములుగు రూరల్: భూముల సరిహద్దు సమస్యలు అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాంప్లెక్స్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన వెంకటాపురం(ఎం) మండలంలో భూముల హద్దుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపడం లేదని అన్నారు. అలాగే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టు ఏరివేత నిలిపివేసి శాంతి చర్చలు నిర్వహించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రైతు భరోసా, రుణమాఫీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా సహాయ కార్యదర్శి రవిందర్, ఎండి అమ్జద్‌పాషా, ముత్యాల రాజు, కుమ్మరి సాగర్ పాల్గొన్నారు.

పత్రికా సేవలను మరిచిన అధికారులు!

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించిన సరస్వతినది పుష్కరాల్లో పత్రికా జర్నలిస్టుల సేవలను అధికారులు మరిచిపోయారని ఆరోపణలు వస్తున్నాయి. పత్రికలు, టీవీచానళ్లు, సోషల్ మీడియా వేదికగా పబ్లిసిటీతో లక్షలాదిగా తరలి వచ్చారని అధికారులు వారి సేవలను గుర్తించకపోవడం గమనార్హం. గతంలో 2015లో గోదావరి, 2022లో ప్రాణహిత పుష్కరాలు నిర్వహించిన సమయంలో పుష్కరాలు ముగిసిన రోజున సంబంధిత స్థానిక జర్నలిస్టులను ఓ వేదిక ఏర్పాటు చేసి ప్రశంసా పత్రాలతో పాటు శాలువాతో సన్మానించి, స్వామివారి తీర్థప్రసాదం అందజేసేవారు. ఈసారి దేవాదాయశాఖ అధికారులు, జిల్లా అధికారయంత్రాంగం కనీసం ఆవిషయాన్ని విస్మరించారనే ఆరోపణలు ఉన్నాయి.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి



సత్యపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కమిటీ సభ్యులు

భూపాలపల్లి రూరల్: శ్రీలక్ష్మీ, భూలక్ష్మీ అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలపై ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి కోరారు. శనివారం భూపాలపల్లి మున్సిపాల్ పరిధిలోని ఫకీరుగడ్డలో నిర్వహించిన శ్రీలక్ష్మీ, భూలక్ష్మీ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయనను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు దొంగల రాజేందర్, సామల మధుసూదన్‌రెడ్డి, కొరె సుధాకర్, బుర్ర సాయికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం పుష్కరాల్లో లక్ష్మీకటాక్షం!

- వ్యాపారుల జేబులు గలగల

కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల్లో స్థానికులకు లక్ష్మీకటాక్షం కురిసింది. మే 15 నుంచి 26 వరకు నిర్వహించిన సరస్వతినది పుష్కరాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి లక్షలాదిగా భక్తులు వచ్చి పుష్కర స్నానాలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు.

జేబులు గలగల!

పుష్కరాల 12 రోజుల్లో ఒక్కో ఆటోవాలలు రూ.లక్షన్నర నుంచి రూ.80వేల వరకు సంపాదించినట్లు తెలిసింది. టీస్టాల్ వారు రూ.50వేలు, వాటర్, కూల్‌డ్రింక్స్ వ్యాపారులు పెద్దవి రూ.రెండు లక్షలు, చిన్నవి రూ.లక్ష వరకు, గోదావరి వద్ద పిండప్రదాన, పూజసామాను, కొబ్బరికాయలు విక్రయించు వారు రూ. 50 వేల నుంచి రూ.70వేలు, హోటళ్లు రూ.5లక్షల నుంచి రూ.1.50లక్షలు వచ్చినట్లు తెలిసింది. అలగే కిరాణ దుకాణాలు రూ.4లక్షల నుంచి రూ.లక్షన్నర వరకు, పూలు, పండ్లు విక్రయించు వారు రూ.60 వేలు, కూరగాయలు రూ.లక్షన్నర, గోదావరిలో ఎడ్ల బండ్లు రూ.80వేలు, బైక్‌పై భక్తులను చేరగొట్టిన వ్యక్తులు రూ.40వేల వరకు, బొమ్మలు, మనియార్ విక్రయాలు రూ.రెండు లక్షలు, కుంకుమ, పూజలు వ్యాపారులు రూ.50వేలు, ఆలయ సమీపంలో లగేజీ బాగ్‌లు దాచువారు రూ.20వేలు, చాట్‌బండార్ విక్రయించు వ్యక్తి రూ.లక్ష, వాటర్ ప్లాంట్లు ఒక్కొక్కరు చల్లని నీరు విక్రయించిన వారు రూ.రెండు లక్షలు, లాడ్జిలు పెద్దవి ఏసీ గదులు రూ.3లక్షలకుపైగా, చిన్నవి ఏసీ గదులు రూ.లక్షన్నర వరకు సంపాదించినట్లు సమాచారం. ఇవికాక మద్యం, బెల్టు దుకాణాల్లో ఇతర వ్యాపారాల్లో రూ.లక్షల్లో వ్యాపారాలు జరిగినట్లు తెలిసింది.

పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: మండలంలోని బంగ్లాపల్లి మాజీ సర్పంచ్ రజిత భర్త యువరాజ్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కలపల్లి రాజు మొగుళ్లపల్లి టౌన్ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్, మాజీ సర్పంచ్‌లు తిప్పారపు యుగంధర్, సుగుణరామారావు పరామర్శించారు. యువరాజ్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

టేకుమట్ల: మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన కొమురయ్య శనివారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. నాయకులు దొంతుల శ్రీనివాస్, బండి రవి, వీరేశం, స్వామి, తిరుపతి ఉన్నారు.

శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి

- ఎస్పీ కిరణ్ ఖరే



ఉద్యోగ విరమణ పొందిన వారితో ఎస్పీ కిరణ్ ఖరే, ఏఎస్పీ నరేష్‌కుమార్

భూపాలపల్లి: పోలీసు శాఖలో ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నదని, రిటైర్మెంట్ అయిన వారు శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. పోలీసు శాఖలో 36 ఏళ్లుగా సేవలందించి శనివారం ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సైలు పల్నాటి సాంబయ్య, పోరిక రతన్‌సింగ్‌లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, గృహోపకరణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో బీరప్ప గుడి నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ.. శనివారం కురుమ సంఘం పట్టణ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడు కోరె కుమారస్వామి, బీరప్ప గుడి పూజారి కోరే సుధాకర్, నాయకులు కోరె రాంబాబు, కంకల మధు, కంచు రాజేందర్, బండి మల్లయ్య, అమృత అశోక్, పోతరాజు రాజయ్య, దొడ్డి వెంకటేశ్వర్లు, శేఖర్, మధుసూదన్ పాల్గొన్నారు.

పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

- ఆర్ఐ శివరామకృష్ణ



మాట్లాడుతున్న ఆర్ఐ శివరామకృష్ణ

మొగుళ్లపల్లి: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆర్ఐ శివరామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని కొర్కిశాల గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ గ్రామస్తులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రజలందరూ కులం, మతం, జాతితో సంబంధం లేకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జి.రాజేశం, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, చంద్రకాంత్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

కాటారం: మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా కొనసాగుతున్న నిర్మాణలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్మూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. అక్రమ నిర్మాణాలకు అధికారులు నోటీసులు మాత్రమే ఇస్తున్నారని చర్యలు తీసుకోవడం లేదన్నారు. గ్రామాల్లోని అసైన్డ్ భూములను ఆ గ్రామాల్లో ఉండే నిరుపేద కుటుంబాలకు లేదా ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించి ఆక్రమణకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని శ్రీకాంత్ అన్నారు.

విదేశీ విద్య రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: మైనార్టీ విద్యార్థుల నుంచి విదేశీ విద్య రుణాలకు (చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్) పథకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీజీ విద్యను అభ్యసిస్తూ ఉపకార వేతనాలు పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్సి విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. జనవరి 1వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందిన వారు అర్హులన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

వాజేడు: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో రైతులకు కావాల్సిన జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు తీసుకువచ్చి జీలుగు విత్తనాలు తీసుకోవాలని తెలిపారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి



తిరోజ(ఫైల్)

చిట్యాల: మండలంలోని అందుకుతండా గ్రామ శివారు ఒంటిప్పతండా గ్రామానికి చెందిన బానోతు తిరోజ (35) పురుగుల మందు తాగి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒంటిప్ప తండాకు చెందిన బానోత్ తిరోజ చిన్న తమ్ముడు తిరుపతి వివాహం బుధవారం గ్రామంలోనే జరుగడంతో భార్యభర్తలు కలిసి వెళ్లారు. దీంతో ఆ వివాహానికి హాజరైన అనంతరం మరుసటి రోజు గురువారం తన తల్లి గారి గ్రామమైన మంచిర్యాల జిల్లా మందమర్రి మామిడిగూడతండాలో తిరుపతి రిసెప్షన్‌కు భార్యభర్తలు వెళ్లారు. అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరగడంతో భర్త రవి అలిగి తిరిగి ఒంటిప్పతండాకు వచ్చాడు. అనంతరం తిరోజ కూడా మరుసటి రోజు శుక్రవారం ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో భర్త ఇంటి వద్ద లేకపోవడంతో భర్త ఇంటికి వచ్చిన అనంతరం తిడతాడనే భయంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన గ్రామస్తులు చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతిరాలి పెద్ద తమ్ముడు ఇస్లావత్ సంపత్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం

- రెండేళ్లు అయినా పూర్తికాని దుస్థితి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, రైతులు
- పట్టించుకోని అధికారులు



పిల్లర్ల దశలోనే ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులు

వెంకటాపురం(కె): గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలు సాఫీగా సాగాలని, వరి పొలాలకు వెళ్తున్న రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పొలాలకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం మండల కేంద్రంలోని కంకలవాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.4.11 కోట్ల నిధులు మంజూరు చేసింది. కాగా కంకలవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ అలసత్వంతో అసంపూర్తిగా ఉన్నాయి. మల్లాపురం, రాచపల్లి, కర్రవానిగుంపు గ్రామానికి చెందిన రైతులు ఈ రహదారి గుండానే గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమై రెండేళ్లు కావస్తున్నాయి. పనులు నత్తనడకన సాగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లర్ల స్టేజీలోనే బ్రిడ్జి పనులు

కంకలవాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు పిల్లర్ల స్టేజి వరకు అయింది. పనులు నిలిచిపోయి ఏడాది కావస్తున్నా నిర్మాణ పనుల జాప్యంపై అధికారులు పట్టించుకోకపోవడంతో పాటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ రహదారి వెంట గిరిజన గ్రామాల ప్రజలు రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకపోతే వర్షాకాలం సీజన్‌లో గిరిజన గ్రామాల ప్రజలు, రైతులు పొలం పనులకు, గ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

రైతులకు తప్పని తిప్పలు

కంకలవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో వర్షాకాలం రైతులకు తిప్పలు తప్పడం లేదు. రైతులు సీజన్‌లో పంటల సాగు కోసం ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి వస్తుంది. ఎరువులు, పురుగుల మందులు ఈ వాగు దాటుకుంటూనే తీసుకువెళ్లాల్సి వస్తుంది. కూలీలు సైతం కంకలవాగు దాటే పనులకు వెళ్లాలి కాని బ్రిడ్జి పనులు పూర్తికాక పోవడంతో వర్షాలకు వాగులు పొంగితే పొలం పనులకు వెళ్లడం కష్టంతో కూడిన పని అని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



కంకలవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరతిగతిన పూర్తి చేయాలి. వ్యవసాయ పనుల కోసం కంకల వాగు అవలి వైపునకు వెళ్లాలి. వర్షాకాలం సీజన్‌లో వరదలతో ఇబ్బందులు పడాల్సి వసుంది. అధికారులు దృష్టి సారించి పనులు వేగవంతం చేసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

- చిట్టెం ఆదినారాయణ, వెంకటాపురం

మిస్సింగ్ కేసును చేధించిన పోలీసులు



సుశీలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై వెంకటేశ్

కన్నాయిగూడెం : మండలంలోని ఐలాపురం గ్రామానికి చెందిన సుశీల అనే యవతి అదృశ్యమైనట్లు ఈ నెల 24న పోలీస్‌స్టేషన్‌లో యువతి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాగా శనివారం పోలీసులు అదృశ్యమైన యువతి ఆచూకీని ట్రేస్ చేసి పట్టుకుని ఆమె కుటుంబ సభ్యులకు ఎస్సై వెంకటేష్ అప్పగించారు.